ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 24.11.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మధ్యాహ్నం కొడంగల్ లో పర్యటించి.. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారు.

2. భగవాన్ సత్యసాయి బాబా అనుసరించిన విధానం, అందించిన సేవలు అందరికీ ఆదర్శమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

3. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగజోన్లుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'హిల్ట్' పాలసీని అమలులోకి తీసుకువచ్చింది.

4. శుభకార్యాల్లో వితంతువులను దూరం పెట్టడం సాంఘిక దురాచారమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో వితంతు మహిళతో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేయించారు.

-------------------

**రేవంత్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మధ్యాహ్నం వికారాబాద్ జిల్లా కొడంగల్ లో పర్యటించనున్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మధ్యాహ్న భోజన పథకం వంటగది భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేస్తారు. అలాగే, కొడంగల్

నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు.

పిఎన్

--------------------------

**ఫ్యూచర్ సిటీ**

భారత్ ఫ్యూచర్ సిటీలో వచ్చేనెల 8, 9 తేదీల్లో జరిగే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిన్న పరిశీలించారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు వస్తారు. అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రమాణాలతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమిట్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. అధికారులతో అక్కడే సమీక్షా సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. సదస్సుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

డెస్క్

--------------------

**సీజేఐ**

భారతదేశ 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్య కాంత్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ ఉదయం రాష్ట్రపతి భవన్‌లో ఆయనతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. నిన్న పదవీ విరమణ చేసిన జస్టిస్ బీఆర్ గవాయ్ స్థానంలో జస్టిస్ సూర్య కాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా సహా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 1962లో హర్యానాలోని హిసార్‌లో జన్మించిన జస్టిస్ సూర్య కాంత్ 1984లో హిసార్ జిల్లా కోర్టులో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు.

NSD

-------------------------

**కిషన్ రెడ్డి**

భగవాన్ సత్యసాయిబాబా అనుసరించిన విధానం, అందించిన సేవలు ప్రపంచానికి ఆదర్శమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆధునిక ఆసుపత్రుల ద్వారా ఒక్క రూపాయి ఆశించకుండా లక్షలాది మంది ప్రజలకు ఉచితంగా ఆపరేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే, వేలాదిమంది విద్యార్థులకు ఉన్నత విద్య వరకు.. ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్ అంబర్పేట్, శివంరోడ్ లోని శివం టెంపుల్లో జరిగిన సత్యసాయి 100వ జయంతి ఉత్సవాల్లో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో తాగునీటి కొరతను తీర్చి వేలాది గ్రామాల దాహార్తిని తీరుస్తున్నారని అన్నారు.

డెస్క్

-------------------------

**సీతక్క**

ములుగు జిల్లా జగ్గన్నపేటలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తో కలసి సామాజిక నీటి శుద్ధి కేంద్రాన్ని, ఉచిత వైద్య శిబిరాన్ని ఈరోజు ప్రారంభించారు. అలాగే 175 మందికి ఉచిత కుట్టుమిషన్లను, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సబ్సిడీ డైరీ యూనిట్ లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ...

బైట్ - సీతక్క

పిటిసి, ములుగు

-------------------------

**శ్రీధర్ బాబు**

పెద్దపల్లి జిల్లా మంథనిలో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యశాలలో స్కానింగ్ మిషన్ ను ప్రారంభించారు. ఎగ్లాస్ పూర్

గ్రామంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆధార్ ఆధారిత వైద్య సేవలను మంథనిలో ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో నిపుణులైన వైద్యులను నియమిస్తున్నామన్నారు.

బైట్ – శ్రీధర్ బాబు

పిటిసి, పెద్దపల్లి

-------------------------

**హిల్ట్ పాలసీ**

హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) పాలసీని అమల్లోకి తీసుకొచ్చింది. హైదరాబాద్ మహానగరం మరింత ఆధునిక, సమతుల అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా నూతన పారిశ్రామిక భూముల వినియోగ విధానాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనను ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించగా.. తాజాగా పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ జీవో విడుదల చేశారు. ఓఆర్ఆర్ లోపల, సమీపంలో మొత్తం 22 పారిశ్రామికవాడల్లో 9 వేల 292 ఎకరాలకు పైగా భూమిని గుర్తించగా.. ఇందులో చదును చేసినది 4 వేల 740 ఎకరాలుగా గుర్తించారు.

డెస్క్

---------------------------

**జూపల్లి**

శుభ కార్యల్లో వితంతువులను దూరం పెట్టడం సాంఘిక దురాచారమని, మూఢనమ్మకాలను అనుసరించవద్దని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతికశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా మాచినేనిపల్లిలో నిన్న ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారు రాముడు ఇంటి భూమిపూజకు మంత్రి హాజరయ్యారు. రాముడు భార్య గర్భిణి కావడంతో ఆయన తల్లి లక్ష్మీదేవమ్మ కొబ్బరికాయ కొట్టేందుకు వెళ్లగా... ఆమె వితంతువు గనుక వద్దని

గ్రామస్థులు వారించడంతో మంత్రి పైవిధంగా వ్యాఖ్యానించారు. లక్ష్మీదేవమ్మతోనే టెంకాయ కొట్టించి పూజ చేయించారు. ఇలాంటి సాంఘిక దురాచారాలను కొనసాగించడం మంచిది కాదని హితవు పలికారు. భర్తను కోల్పోయి మానసికవేదనకు గురవుతున్న మహిళలను శుభకార్యాలకు దూరంగా ఉంచడం, నోములు, వ్రతాలకు పిలవకుండా బహిష్కరించడం అమానవీయమని మంత్రి అన్నారు.

డెస్క్

-----------------------------------

కార్మిక చట్టాలు

కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా చేయడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా ఏఐటీయుసీ అధ్యక్షులు అగ్నివేణు హర్షం వ్యక్తం చేశారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ..... వారంలో 48 గంటలు పని దినాలు ప్రకటించడం స్వాగతిస్తున్నామన్నారు.

**బైట్ వేణు**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

----------------------------

**బాల్య వివాహాలు**

బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించడం అందరి బాధ్యత అని సూర్యాపేట జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కే. నరసింహరావు అన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు గిరిజన తండాల్లో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాల్య వివాహాలు చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.. అమ్మాయిల భవిష్యత్ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని వివరించారు.

పిటిసి, నల్గొండ

--------------------------

**రవాణ**

నిబంధనలు ఉల్లంఘించే రవాణా వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఉమ్మడి జిల్లా రవాణా శాఖ ఇన్చార్జి ఉప కమిషనర్ పెద్దింటి పురుషోత్తం పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా హన్మకొండ, వరంగల్ రవాణాశాఖ అధికారులు విజిలెన్స్ బృందాలను రంగంలోకి దించి తనిఖీలను నిర్వహిస్తూ పన్నుల చెల్లింపులు అనుమతి పత్రాలు, ఫిట్నెస్, ఓవర్లోడ్ వంటి అంశాలను పరిశీలిస్తూ నిబంధనలు పాటించని వాహనాలపై జరిమానాలు విధిస్తున్నారు. గత 18 రోజులలో వరంగల్ జిల్లాలో 102 కేసులు, హన్మకొండ జిల్లాలో 154 కేసులు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

పిటిసి, వరంగల్

-----------------------------

**జూపల్లి**

అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇండ్లు నిర్మించి అందిస్తామని జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదిలాబాద్ అర్బన్ మండలం అనుకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఇంకా ఇండ్లు నిర్మించని అర్హులకు బ్యాంకులు, శ్రీనిధి, మహిళా సంఘాల ద్వారా సులభ రుణాలు అందించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. ఆదిలాబాద్ లో ఏయిర్పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని ప్రకటించారు.

పిటిసి, నిర్మల్

----------------------------

**శిక్షణ**

మానవ అక్రమ రవాణా నివారణ కోసం మై ఛాయిస్ ఫౌండేషన్ తో కలిసి తెలంగాణ మహిళా భద్రత విభాగం చేపట్టిన సేఫ్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయి శిక్షణను పోలీస్ డైరెక్టర్

జనరల్ శివధర్‌రెడ్డి, ఆ విభాగం అదనపు డీజీపీ చారుసిన్హా నిన్న ప్రారంభించారు. అనంతరం మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేలా రూపొందించిన సేఫ్ విలేజ్ కామిక్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. లైంగిక వేధింపులు, గృహహింస, ఈవ్‌టీజింగ్, సైబర్ దోపిడీ వంటివి మహిళలు, చిన్నారులను తీవ్రంగా ప్రభావితం చేస్తాయన్నారు. క్షేత్రస్థాయిలో వీటిని అరికట్టేలా సేఫ్ విలేజ్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు.

డెస్క్

----------------------------

**ఆధార్**

వచ్చేనెల 1 నుంచి 'ఆధార్' సేవలు రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లోని అన్ని మండలాల్లో అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు అనుగుణంగా మీ-సేవ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ ఆధ్వర్యంలో ఆధార్ కేంద్రాల నిర్వాహకులకు నూతన ఆధార్ కిట్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 551 ఆధార్ నిర్వాహకులు సేవలు అందిస్తున్నారు.

డెస్క్

-----------------------------------